

# శవం

రఘురామ్

ఊరికి దూరంగా, నగర శరీరంమీద అసహ్యంగా లేచిన రాచకురుపులాగా ఉందా వీధి. ఆ వీధిలో తాటాకు పాకలు, కుక్కలు చింపిన ఎంగిలి విస్తరాకు ముక్కల్లాగా చిందర వందరగా, అసహ్యంగా ఉన్నాయి. పాకల మధ్యగా కుళ్ళు కాలువ ప్రవహిస్తూంది వాటిలో పందులు జలక్రీడ లాడుతున్నాయి.

ఆ వీధిలో నివసించే వాళ్ళని చాలామంది అలగా జనం అంటారు. కొందరు అభాగ్య జనం అంటారు. అక్కడ బ్రాకెట్ కంపెనీ ఏజంట్ల దగ్గర్నుండీ – వాళ్ళమ్మకు బ్రతికే వాళ్ళకు ఏజంట్లుగా వ్యవహరించే వాళ్ళ వరకూ ఉన్నారు. పది రూపాయలకి పెళ్ళాల్ని తార్చేవారు. పాతిక రూపాయలకి పీకల్ని కత్తిరించేవారు అక్కడుంటారు.

అక్కడ ఆకలి ఉంది. అశాంతి ఉంది, అమాయకత్వముంది, అజ్ఞానముంది.

అప్పటికి మూడ్రోజులు నుండి గాలివాన. వీధిలో తాటాకు పాకలు చాలా వరకు కూలి పోయాయి. మిగిలినవి కూలిపోవటానికి సిద్ధంగా ఉన్నాయి. గాలివాన ఉధృతంతగ్గే సూచనలు కనబడ్డంలేదు.

వర్షం చినుకులు పడి, ఆకులు, కొమ్మలు బరువై తలవొంచుకున్న గన్నేరు చెట్టు బీదవాడి దైన్యంలాగా ఉంది.

సగం కూలిన తాటిపాకలో, ఒక మూలగా చిరిగిన చాపమీద, మురికి పట్టిన గోనే సంచి ముక్కల్ని కప్పుకుని చలికి వణికి పోతూ రాటకు ఆనుకుని కూర్చున్నారు ఇద్దరు భావిభారత పౌరులు. అందులో పెద్దవాడికి పదిహేను సంవత్సరాలుంటాయి. చిన్నవాడికి పన్నెండుంటాయి.

పిల్లలిద్దరి ప్రక్కన జ్వరంతో, ఒంటిమీద స్పృహలేనట్లుగా పడి వుందొక ఎముకల గూడు.

ఆ ఎముకల గూడు ఆ పిల్లల తల్లి.

ఒళ్ళెరుగని జ్వరంతో పడివున్న తల్లిని దీనంగా, బాధగా, నిస్సహాయంగా పిల్లలిద్దరూ చూడసాగారు.

వారికి ఏం చేయాలో తోచడంలేదు. మూడు రోజుల నుండీ గాలివాన వలన అడుక్కోవటానికి కుదరలేదు. గుక్కెడు గంజినీళ్ళయినా మూడురోజుల నుండీ లేకపోవడంవలన ఆకలి భరింపశక్యంకాకుండా వుంది. దానికి తోడు ఎముకల్ని కొరికేసే చలి.

వర్షానికి లోపల పాకంతా తడిసిపోయింది.

బైట కుండ పోతగా వర్షం - హోరుగాలి.

పెద్దవాడు తన వంటిమీదున్న గోనె సంచి తీసి వణుకు తున్న తల్లి మీద కప్పేడు. చలికి ముడుచుకుని కూర్చున్న తమ్ముడివైపు చూశాడు. దేశంలోని దౌర్భాగ్యం, దైన్యం అంతా కూడకట్టుకుని తమ్ముడి కళ్ళలోనే ఉన్నట్లని పించింది వాడికి. మూడురోజుల నుండి తమ్ముడు ఆకలితోనే ఉన్నాడని గుర్తుకు రాగానే ఏదో బాధ గుండెలో కలుక్కుమంది.

తమ్ముడితో పాటు, తనుకూడా మూడు రోజుల నుండి ఆకలితోనే ఉన్నానన్న సంగతి ఆసయమంలో పెద్దాడు మరచిపోయాడు ప్రేమగా, నిస్సహాయంగా తమ్ముడిని దగ్గరికి తీసుకుని, తల నిమిరాడు.

పెద్దవాడికి పదిహేను సంవత్సరాల వయస్సుకే నలభైఏళ్ళ మనిషిలా జీవితం గురించి ప్రతిక్షణమూ ఆలోచిస్తూ ఉంటాడు.

ఎక్కడో పిడుగు పడింది కాబోలు - ఆకాశం ధనవంతుడి హుంకరింపులా భయంకరంగా గర్జించింది.

పిల్లలిద్దరూ ఉలిక్కిపడ్డారు. ఒకరి ముఖాన్ని ఒకరు భయంగా చూసుకున్నారు.

> * దోమలు మగవారికంటే ఆడవారినే ఎక్కువగా కుడతాయి. కారణం - మగవారి శరీరం కన్నా ఆడవారి శరీరం మృదువుగా ఉండటమే.

నాలుగవరోజు తెల్లవారుతూనే గాలివాన తగ్గింది. ఏడ్చి ఏడ్చి అలసిపోయి వూరుకున్న అభాగ్యుడి వదనంలాగా ప్రశాంతంగా ఉంది ఆకాశం.

గాలివానకు పడిపోయిన పాకలను సరిచేసు కోవడానికి కొందరు తంటాలు పడుతున్నారు.

పేదవాడి ప్రాణం గట్టిదంటారు. ఆ విషయం ఎముకలగూడు పట్ల మరోసారి ఋజువయ్యింది. ఎటువంటి మందు లేకుండానే తల్లి జ్వరం గాలివానతో పాటు తగ్గింది.

పెద్దవాడు వెంకడి టీకొట్టుకు వెళ్ళి తరువాత డబ్బు లిస్తానని చెప్పి టీ తీసుకువచ్చి తల్లికి యిచ్చేడు. తల్లి మెల్లగా లేచి రాటకు నీరసంగా జాగిలపడి టీ తాగింది.

టీ తాగి కాస్త కొలుకున్న తర్వాత కొడుకుల ముఖాల్లోకి చూసింది.

ఎండిన డొక్కల్తో, లోతుకు పోయిన కళ్ళలో ఉన్న పిల్లలను చూడగానే మాతృ హృదయంతరుక్కుపోయింది. పిల్లలకింత పెట్టలేక పోతున్నాననే బాధతో తల్లడిల్లి పోయింది.

'ఇయ్యేళ ఏంవారంరా అన్నా' నెమ్మదిగా ప్రశ్నించాడు చిన్నవాడు అన్నను చూస్తూ

"శనివారం" జవాబిచ్చాడు పెద్దాడు.

"అయితే తొరగా ఎంకట్రమణమూర్తి గుడికెళ్దాం పద" అన్నాడు"

తమ్ముడి ఆలోచన అన్నకు అర్థమయ్యింది. "ఈదినం గుడికెవరొత్తార్రా సన్నా! లోపంతా బురదగుంటది. అయినా పద. ఎల్లొద్దాం" అన్నాడు మిణుకు మిణుకు మనే ఆశతో. ఇద్దరూ

---

వచ్చే సంచికలో 'కే.శే. ఎన్ కౌంటర్ దశరథరామ్' రచించిన సంచలనాత్మక జంట కథలు మిస్ కాకండి'

గుడికి బయల్దేరారు. పెద్దవాడి అనుమానం నిజమయ్యింది. పైసా కూడా అక్కడ సంపాదించలేక పోయారు. ముఖాలు దిగాలు పడి ఇంటికి నడిచారు.

దారిలో ఒచోట ఇరవై సంవత్సరాల కుర్రవాడు శవాన్ని రోడ్డు పక్కగా ఉంచి, "బాబూ! దిక్కులేని శవం బాబూ! ధర్మం చెయ్యండి" అంటూ అడుక్కుంటున్నాడు.

దారిన పోయేవాళ్ళు ఆ అనాధ శవాన్ని చూసి చిల్లర డబ్బులు వేస్తున్నారు.

శవం చుట్టూ పడివున్న డబ్బుల్ని ఆశగా, ఆశ్చర్యంగా చూశాడు చిన్నవాడు.

'ఎన్ని డబ్బులో' అనుకున్నాడు. ఇంత వరకూ ఏనాడూ తాము అన్ని డబ్బులు సంపాదించలేదు.

'శవం దగ్గరున్న డబ్బుల్తో నెల రోజులు బతికేయొచ్చు' అనుకున్నాడు చిన్నాడు.

"పదరా సిన్నా! అమ్మ మనకోసం ఎదురు చూస్తాంటుంది" అన్నాడు పెద్దవాడు ముందుకు నడుస్తూ.

శవాన్ని, శవం చుట్టూ పడివున్న డబ్బుల్ని చివరిసారిగా, కరువు తీరా చూస్తున్నట్లుగా చూసి, అన్న వెనుకగా నడిచాడు తమ్ముడు.

అరువిచ్చే వెంకడి టీకొట్టుకెళ్ళి టీనీళ్లతో కడుపు నింపుకున్నారు తల్లికొడుకులు.

ఇంటికి రాగానే తాము చూసిన శవం గురించి, డబ్బులు గురించి పూసగుచ్చినట్లుగా వివరించి చెప్పాడు చిన్నవాడు తల్లితో

తల్లి మౌనంగా కొడుకు చెప్పిందంతా వింది. బయట కామంధ దౌర్జన్యలాగా, కామాంధుడి కోరిక లాగా చీకటి వెన్నెలను కబలించటానికి ప్రయత్నిస్తోంది. పేదవాడి ఆశలాగా ఆకాశంలో నక్షత్రాలు మినుకు మినుకు మంటున్నాయి.

"శవం దొరికితే బావుండు. బోలెడన్ని డబ్బులొస్తాయి" ఉన్నట్లుండి అన్నాడు చిన్నవాడు.

ఆ మాటలకు తల్లి, పెద్దవాడు ఉలిక్కి పడ్డారు. శవాన్ని ఎరగా పెట్టి అడుక్కుంటే డబ్బులు బాగానే వస్తాయి. మృత్యువంటే మనిషికి తగని భయం!

"శవం మనకెట్టా దొరుకుతుంది!" నిరాశగా అన్నాడు పెద్దవాడు.

దొరకదన్నట్టు పెదవి విరిచి నైరాశ్యంతో చాపమీద పడుకున్నాడు చిన్నవాడు.

కొడుకుల సంభాషణలు విని తల్లి దీర్ఘంగా నిట్టూర్చింది. ఆలోచనలు ముట్టుముట్టాయి.

పిల్లలిద్దరూ నిద్రపోయారు.

అర్ధరాత్రి దాటినా, తల్లికి నిద్ర పట్టలేదు.

"శవం దొరికితే బాగుండు, బోలెడన్ని డబ్బులొస్తాయి" చిన్నవాడన్న మాటలు పదే పదే గుర్తుకొస్తున్నాయి తల్లికి.

ముడతలు పడ్డ చర్మంతో అసహ్యంగా వున్న తన శరీరాన్ని చూసుకుని, వెర్రిగా నవ్వుకుంది.

"ఈ శరీరం ఇంకా దేనికోసం? పిల్లల కష్టంతో శరీరాన్ని పోషిస్తుంది. తను జీవించటం పిల్లలకు బరువు. కన్నందుకు కడుపునిండా పిల్లలకు ఇంత తిండి పెట్టలేక పోయింది ఏనాడూ, చచ మాతృ హృదయం నిట్టూర్చింది. ఏదో నిశ్చయానికి వచ్చిన దానిలా పిల్లలవైపు చూసింది.

మర్నాడు-

తూర్పుదిక్కున సూర్యుడు యధాప్రకారం ఉదయించాడు. పిల్లలిద్దరూ లేచి, ఇంకా లేవని తల్లిని చూసి ఆశ్చర్యపోయారు. అందరికన్నా ముందుగా లేచి, తమను నిద్రలేపేది అటువంటిది ఇంకా నిద్రపోతోంది. పెద్దవాడు తల్లిని తట్టి పిలిచాడు.

తల్లికదల్లేదు. పలకలేదు.

గన్నేరు పిక్కల వాసన తల్లిదగ్గరి నుండి గుప్పున తగలగానే

"శవం దొరికితే బాగుండు. బోలెడన్ని డబ్బులొస్తాయి" అన్న చిన్నవాడి మాటలు గబుక్కున గుర్తుకు వచ్చి బావురు మన్నాడు పెద్దాడు.

*

మీ సలహాలు - సూచనలు మాకు పంపండి....